



చక్రవర్తి బి. ఏ. చదివాడు.
మూడేళ్ళు అష్ట కష్టాలుపడి చదివాడు.
ఏం తోచక చదవలేదు.
సరదాకి చదవలేదు.
విజ్ఞానంకోసమూ కాదు.
బ్రతుకుతెరువు కోసం - ఉద్యోగం కోసం చదివాడు.

ఇంట్లోని మట్టి తప్ప మిగతాదంతా వూడ్చి తనేదోవుద్ధరిస్తాడని చదివించినతలిదండ్రులు. ఉద్యోగంనుంచిరిటైరయిన తండ్రి, జీవితంనుండి రిటైరవబోతున్న తల్లి కోసం చదివాడు. తనమీదే ఆశలు పెట్టుకొని బ్రతుకుతున్న చెల్లిపెళ్ళికోసం చదివాడు.

చక్రవర్తి అందుకోసం చదివాడు బి. ఏ.

డిగ్రీ చేతికొచ్చినప్పటినుంచీ జిగురుతోదాన్ని చేతి కంటించుకుని తిరుగుతున్నాడు ఉద్యోగం కోసం. కాళ్ళకుబొబ్బలు, పెన్నిళ్ళకట్టుకోకపోయినా, అరిగిపోయినపాతజోళ్ళనేవేసుకొనితిరుగుతున్నాడు. ఆఫీసు, ఆఫీసుచుట్టూ-ప్రతి ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాడు. తిరిగిన ఆఫీసుచుట్టూ మళ్ళీ మళ్ళీ తిరుగుతున్నాడు. అరిగిన జోళ్ళతోనే తిరుగుతున్నాడు. విసుగూ విరామంలేకుండా తిరుగుతున్నాడు. అప్పుడప్పుడు అన్నపానాదులుగూడ వదులుకొని తిరుగుతున్నాడు. తిరిగి తిరిగి వట్టి చేతుల్తో యింటికొస్తున్నాడు.

ఆర్నెల్లు తిరిగాడు.

ఈ ఆర్నెల్లలో తెలిసిన వారికీ తెలియనివారికీ నమస్కారం పెట్టాడు. ఒకటికిపదేశిసార్లు పెట్టాడు. ఉద్యోగం యిస్తారనే నమ్మకముంటే కాళ్ళుగూడా పట్టుకొనేవాడు. కాని అతనికి ఆ అవకాశమివ్వలేదెవరూ.

ఆర్నెల్లనుంచి ఆదేపనిగా తిరుగుతున్నా ఉద్యోగం దొరకలేదు. చక్రవర్తి బి. ఏ కి గుమాస్తా నౌకరీ కాదుగదా నౌకరుపనిగూడ దొరకలేదు కనీసం.

ఎట్లా దొరుకుతుంది?
ఎందుకు దొరుకుతుంది?
అసలెందుకు దొరకాలి?

ఉద్యోగానికి కావల్సిన అర్హతల్లో ఒకటైనా ఉందా అతని దగ్గర?

విటమిన్ ఎం. (మనీ) వుందా? - లేదు.

పోనీ, విటమిన్ ఆర్. (రికమెండేషన్) వుందా? - అదీ లేదు.

కనీసం, మిసెస్ మినిష్టరుగారి మేనత్త దత్తపుత్రుడా? - కానేకాదు.

మరి ఎట్లా దొరుకుతుంది?
ఇంకెట్లా దొరుకుతుం దనుకు?
ఉందిగదా బి. ఏ. డిగ్రీ!

ఎవడిక్కావాలి బోడి బి. ఏ; యం. ఏ. డిగ్రీలు?

బి. ఏ. లతో ఎం. ఏ. లతో ఉద్యోగా లిస్తారని ఎవరన్నారు? ఉద్యోగానికిబి ఏ; ఎం, ఏలు కావాలన్న దెవరు? ఈ విషయం తెలియకనే పాపం చక్రవర్తి బి. ఏ. చదివాడు. అందుకనే ఉద్యోగం దొరకలేదు. దొరుకుతుందనే ఆశలేదు.

దొరకాలి అనే రూల్ అంతకన్నా లేదు.

భూతద్దం కాదుగదా బైనాక్యులర్స్ లోంచి చూచినా కనుచూపు మేర దూరంలో ఉద్యోగం కాదుగదా దాని నీడగూడ కనిపించటం లేదు!

అందుకే ఆ ప్రయత్నం విరమించుకున్నాడు చక్రవర్తి. బి. ఏ...పదివేల నమస్కారాలు పెట్టి మరీ విరమించుకున్నాడు.

* * *

వీధి చివర్నవుంటున్న రిక్షారాములితో మాటలు కలిపి. కాకాహోటల్లో పావుకప్పు కాఫీ పోయించి మంచి చేసుకున్నాడు. ఆ మంచితనంతో నాలుగు రాత్రిళ్ళు నానా అవస్థలూ పడి రిక్షా నడపటం నేర్చుకున్నాడు.

"రిక్షా డ్రైవింగ్ వచ్చు. నమ్మకమైన వాడేను" అని రిక్షా రాములు సర్టిఫై చేసిన పిమ్మట, బాడుగకు రిక్షా సంపాదించుకో గల్గాడు చక్రవర్తి బి. ఏ. అయితే యిది ఆర్నెల్లు పట్టలేదు. అంతగా అవస్థ పడలేదు.

ఓ శుభరాత్రి టౌనంతా కలత నిద్ర పోతున్న వేళ రిక్షాచేపట్టాడు చక్రవర్తిబి.ఏ. చేబట్టాడుఅంతే ఇంకాబాడుగకు బయలుదేరలేదు. తను చదివిన కాలేజీ దగ్గరనుంచి బయలుదేరదా మనుకున్నాడు. అందుకే కాలేజీవరకూ నడిపించుకునే వెళ్ళాడు.

సరిగ్గా కాలేజీ గేటు ముందు నిలిపాడు రిక్షాని. భద్రంగా జేబులోదాచుకున్న బి. ఏ. డిగ్రీ పైకి తీశాడు. ముచ్చటగా మూడుసార్లు చదువుకున్నాడు. అలాగే చేతబట్టుకొని రిక్షాచుట్టూ మూడుసార్లుప్రదక్షిణచేశాడు. మళ్ళీ దాన్ని భద్రంగా మడిచాడు. మడిచిన దాన్ని ధైర్యంగా జాగ్రత్తగా రెండుగా నాలుగుగా... ఇలా పదహారు సమాన దీర్ఘచతురస్రపు ముక్కలుగా చేశాడు. వాటిని రిక్షాకి కాలేజీ గేటుకి మధ్యగా పడేశాడు. జేబులోంచి మామిడి కాయ మార్కు అగ్గిపెట్టితీసి అందులోంచి రెండు పుల్లలుతీసి ఒకేసారి గీచి ఆముక్కల కంటించాడు.

(చక్రవర్తి అమాయకుడు. అందుకే మామిడి కాయ మార్కు అగ్గిపుల్లలు రెండు వృథాచేశాడు ఆ చివిగిన బి. ఏ. డిగ్రీని కాల్చటానికి. అంత కన్నా ఛీప్ క్వాలిటీది ఏదైనా ఒకేఒకపుల్లతో అద్భుతంగా కాలేది.)

ఆ ముక్కలు మండాయి. బ్రహ్మాండంగా మండాయి. గడ్డిపరకలకన్నా, గుడ్డపీలికలకన్నా త్వరగామండాయి. వాటికన్నా అందంగామండాయి.

చక్రవర్తి తెలివి మాలిన తనానికి వృథాఅయిన మూడు సంవత్సరాలు ఆ మంటలో దేదీప్యమానంగా వెలిగాయి.

తన జీవితంలోని అత్యంత విలువైన మూడు సంవత్సరాల్ని దిగమింగిన ఆ కాగితపు ముక్కలు మండుతుంటే, తృప్తిగా సంతృప్తిగా చిరునవ్వు నవ్వుతూ రెండు చేతులూ చాచి చలిమంట కాచుకున్నాడు చక్రవర్తి.

అర్ధరాత్రి ఆ దృశ్యం చూచి కుమిలి కుమిలి ఏడ్చింది కాలేజీ ఎవరూ చూడకుండా. చీకట్లో కవలి కవలి ఏడ్చింది కాలేజీ.

ఏడ్చి ఏడ్చి నవ్వింది.

పక్కున నవ్వింది.

కడుపుబ్బ నవ్వింది.

పదహారు పళ్లూ బయటపెట్టి మరీనవ్వింది.

నవ్వుతూ అంది.

అర్భకుడా

అభాగ్యుడా

బ్రతుకు నేర్వని వాడా

బ్రతుక లేనివాడా

విజ్ఞానము సముపార్జించిన వాడా

విత్తము సంపాదించ లేని వాడా

తెలివైన వాడా

అసలేమీ తెలియని వాడా

అమాయకుడా

అర్భకుడా.

అభాగ్యుడా.

అంటూ నవ్వింది.

బి. ఏ. డిగ్రీ కాలి బూడిదయింది. చక్రవర్తి ఆ బూడిదను మహానాయకుడి చితాభస్మాన్ని మహానదిలో కలిపినట్లు, పక్కన వున్నసైడ్ కాల్వలో కలిపాడు. మురికినీళ్ళమీద ఆ బూడిద తెట్టలా తేలుతుంది. అది కొన్ని నిమిషాలక్రితం బి. ఏ. డిగ్రీ అని మానవ మాత్రుడెవడూ కనుక్కోలేడు.

రాత్రి పన్నెండు దాటింది.

రిక్షాకదిలింది. రిక్షా చక్రవర్తి లీలామహల్‌కేసి బయలు దేరాడు. లీలా మహల్లో సెకండ్‌షో వదిలే టైం. అందుకే జోరుజోరుగా పోనిస్తున్నాడు రిక్షావి బికారి చక్రవర్తి.

"ఏయ్! రిక్షా ఆపు!"

చక్రవర్తి సడన్ బ్రేక్‌వేశాడు. బయలుదేరిన వేళా విశేషం మంచిదనుకున్నాడు. వెంటనే బేరం తగిలిందని సంతోషించాడు.

ఎదురుగా ఎర్రటోపీ లాఠీతోసహా తనవేపే వస్తూంది. వస్తూనే గదుముతూ అడిగింది.

"లైటేదీ!"

రాత్రిపూట రిక్షా తొక్కేటప్పుడు లైటుండాలన్న సంగతిఅప్పుడు గుర్తొచ్చింది చక్రవర్తికి. బిక్కమొహం వేశాడు.

"ఏరా! మాట్లాడవ్. పదస్టేషన్‌కి" కుక్కను కసిరినట్లు కసిరింది ఎర్రటోపీ.

చక్రవర్తి మనస్సు చివుక్కుమంది. డిగ్రీ నయితే కాల్చేశాడుగాని అది మిగిల్చిన అభిమానాన్ని కాల్చుకోలేదింకా. అందుకే కానిస్టేబుల్ "ఏరా" అనగానే రోషం వచ్చింది. కాని ఏం లాభం! తను చేసింది తప్పు! బలవంతాన రోషాన్ని, అభిమానాన్ని చంపుకొని బ్రతిమలాడుతూ అన్నాడు.

"క్షమించండి, పొరపాటయింది. యిప్పుడే బండివేశాను. యింకాబోణీగూడా కాలేదు. ఈ సారికి వదిలేయండి. ఇంకెప్పుడూ లైట్‌లేకుండా బండినడపను". చక్రవర్తి మొఖంచూచి ఎర్రటోపీకొస్త జాలిపడింది.

# "పూలగుండెల్లో శంక మండుతోంది!"

నిత్యం తమతో దోబూచులాడే
నిండుజాబిల్లిని....
పండువెన్నెల్లో ఊయల్లూచే
చల్లని చందమామను....
నల్లని నీడలేవో 'హత్య' చేస్తుంటే
నవ్వే పూలగుండెల్లో వణకు!
భవిష్యత్తంతా ఇలాగే
రంగారు భృంగారు వెలుగుమయమని నమ్మి
పాలజాలులో ప్రతిమను చూసుకుంటూ
నవ్వుతూ - విహరిస్తున్న
పచ్చని తోటను
పరపరా....
స్వార్థంతో - ఉన్మాదంతో
నరుక్కుపోతుంటే....
లేత గుండెల్లో భయం!
అనంత ప్రకృతిలో, ఆకాశంలో
ఆ సుదూరంగా మండే గలాక్సీల్లో-నిండి
నిర్భరమై
తమ ముఖాలపైకి ప్రేమగా
చాస్తూవస్తున్న కాంతుల్ని, రంగుల్ని
కసిగా, విషంక్రక్కుతూ
చీకటి - కప్పి, ఆపివేస్తుంటే....
సంతోషతరంగితమైన తెల్లని పసిగుండెల్లో
క్రోధం!
మధువును పంచుకుంటూ
మధురతను చిమ్ముకుంటూ
పిల్లతెమ్మెరల మేస్తూ
కోయిలపాటల్లో తూగి
నిత్య వసంతంలో సుఖించాలనుకున్న
తమ వెలలేని జీవితాలను -
రాక్షస విపణిలో క్రూరంగా వేలం వేస్తుంటే
పలుకలేని సుతిమెత్తని గుండెల్లో,
రక్తంలో - దైన్యం, తుఫాను!
అంతా కలిపి ముందుకు చూస్తే
అనుమానపు అంగార జ్వాలలు
అంతర్యంలో మండుతున్నాయి!
ఆనందం హావిస్సుగా జ్వలిస్తున్నాయి!
అందాల హరివిల్లును హరిస్తున్నాయి!

\- జ్వలన్మతి

"ప్రతి రిక్షావెధవకీ యిదొక మామూలై పోయింది.

సరే. వెనక్కు తిప్పు."

రిక్షా వెనక్కు తిరిగింది.

'పోలీస్' ఎక్కి కూర్చోని అంది ఎర్రటోపీ.

రిక్షా ముందుకు కదిలింది.

అరండల్ పేట చివరలో ఓ యింటిముందాగింది ఎర్రటోపీ రిక్షా దిగి ఆ యింట్లోకి జొరబడింది. చక్రవర్తి నోరుతెరుచుకుని అటే చూడసాగాడు.

లైటు లేదని పట్టుకొన్న ఎర్రటోపీ ఆ లైటు లేని రిక్షాలోనే ఎందుకెక్కిందో, బండిదిగి బాడుగివ్వకుండా-పోనీ మళ్ళీ వచ్చి ఇస్తానని గూడా చెప్పకుండా ఆ యింట్లో ఎందుకు జొరబడిందో చక్రవర్తికి అర్థంకాలేదు. ఆశ్చర్యంగా అటే చూడసాగాడు.

చక్రవర్తి ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే యింకో సంఘటన జరిగింది.

రెండు చౌకబారు నైలాన్ ఓణీలు "ఏం మామా బాగున్నావా, రా!" అంటూ మీదెల్లా పడి మరీ ఆహ్వానిస్తున్నాయి ఎర్రటోపీని.

అప్పుడే పంచె సరిచేసుకొంటూ కొంచెంగా తూలుతూ వచ్చే ఓ జరీకండువా 'పెద్దమనిషి' పక్కజేబులోంచి రెండు రూపాయినోట్లు తీసి ఎర్రటోపీ చేతిలో పెట్టి సరిపెట్టుకోమని చేత్తో సైగ చేస్తున్నాడు. ఎర్రటోపీ అసంతృప్తిగా మొహం అదోలా పెట్టి లోపలికెళ్ళింది. జరీ కండువా తూలుతూ బయటికొచ్చింది.

బండెక్కి మత్తుగా నిర్లక్ష్యంగా అంది జరీ కండువా, "రేయ్, పోనీరా!"

"ఆయన...బాడుగ..." నసిగాడు చక్రవర్తి.

పగలబడి నవ్వుతూ అంది జరీ కండువా.

"కొత్తాడిలాగున్నావ్, పిచ్చి సన్నాసి! ఆ కానిస్టేబుల్ బాడుగేనా? అతనిప్పుడప్పుడే బయటికి రాడు. వచ్చినా నీ బాడుగ డబ్బులివ్వడుగాని పద!"

జరీ కండువామాటను పెద్దమనిషి మాటగా భావించి రిక్షాను ముందుకు లాగించాడు చక్రవర్తి.

బ్రాడీపేటలో ఓ చిన్న మేడముందాగింది రిక్షా.

బండిదిగి తూలే శరీరాన్ని నిలదొక్కుకుంటూ మహారాజులా చక్కాపోతుంది జరీకండువా మాటా మంతీ లేకుండా.

చక్రవర్తికి ఒళ్ళు మండింది. పళ్ళు బిగుసుకున్నయ్. కోపాన్ని తగ్గించుకుంటూ అడిగాడు.

"ఏమండీ బాడుగ డబ్బులు?"

జరీకండువా వెనక్కు తిరక్కుండానే జవాబిచ్చింది.

'రేపు యిదేవేళ అక్కడ కనబడు'

చక్రవర్తి విసిరిన క్రోధపు, అసహ్యపు చూపులు ఆ జరీకండువా దాటి లోపలికి పోలేక తిరిగివచ్చాయి.

చక్రవర్తికి జీవితంమీద మొట్టమొదటిసారిగా అసహ్యం, విరక్తీ కల్గాయి. లోకంమీద కోపం ముంచుకొచ్చింది.

"ఛీ, వెధవలోకం వెధవ మనుష్యులు, నీతిగా న్యాయంగా కష్టపడి పనిచేసేవాడికి కూడు లేదు."

విరక్తిగా జరీకండువా నుండి దృష్టి మళ్ళించాడు చక్రవర్తి. అప్పటివరకూ బిగబట్టివుంచిన అనిసీతి బ్రేకుల్ని సడలించాడు. బండి ముందుకు పరిగెత్తింది, చక్రవర్తి మళ్ళీ వెనుదిరిగి చూడలేదు.

రిక్షా స్పీడుగా పోతోంది. చక్రాలు గిరగిరా తిరుగుతున్నాయి. చక్రవర్తి మెదడులో ఆలోచనలు గూడా ఆ చక్రాల్లాగే సుళ్ళు తిరుగుతున్నాయి. ఎర్రటోపీ కానిస్టేబుల్, జరీకండువా 'పెద్దమనిషి' చౌకబారు నైలాన్ ఓణీల (ముసలి) పడుచులు ఆ చక్రాల క్రింద పడిపోతున్నారు. పడిగూడా మళ్ళీ నిటారుగా లేవగల్గుతున్నారు. చక్రవర్తికి అదే అర్థం కావటంలేదు. అందుకే అతను ఆశ్చర్యపోతున్నాడు ప్రతిసారీ.

తనుమాత్రం ఎందుకిలా ఈ రిక్షామీద వంగబడాలి? తనూ వాళ్ళలా ఎందుకు నిటారుగా నిలబడలేకపోతున్నాడు? కాదు. తనూ నిలబడగలడు. కాని ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఇప్పుడు ప్రయత్నించి చూడాలి.

ఆలోచనలకు బ్రేక్ వేసి రైల్వేస్టేషన్ముందు రిక్షా ఆపాడు చక్రవర్తి.

బుకింగ్హాల్లో ప్రయాణీకులు పడుకొనివున్నారు. అయితే అందరూ నిద్రపోతున్నారో లేదో చెప్పటం కష్టం. కొందరు మాత్రం నిద్రపోతున్నారు. మిగిలిన కొందరు నిద్రపోవటానికి ప్రయత్నిస్తున్నారు. లేదా నిద్రపోతున్నట్లు నటిస్తున్నారు.

చక్రవర్తి హాలంతా ఓసారి కలయ జూడసాగాడు. అలా చూస్తూచూస్తూ ఓ చోట నిలిచిపోయాయి అతని చూపులు. ఓ పెద్దమనిషి జేబులోని మనీపర్సు తన వైపే తొంగి చూస్తూ రారమ్మని ఆహ్వానిస్తుంది.

చక్రవర్తికి భయం భయంగా వుంది. మళ్ళీ ఓ మారు చుట్టూచూసి తన్నెవరూ గమనించటం లేదని తేల్చుకొని గుండె దిటవుచేసుకొని ముందుకు నడిచాడు తడబడే అడుగులతో ఒకటీ... రెండూ...అడుగులు వేశాడు నాలుగు పరకూ అంతే ఆగిపోయాడు. గుండెల్లో గుబులూ, నరాల్లో వణుకు అతన్ని కదలనివ్వలేదు. ముఖ్యంగా అతన్ని విడిచిపెట్టలేక ఓమూల గట్టిగా పట్టుకొని యేలాడుతున్న నీతి. అతన్ని మరొక్క అడుగు ముందుకు వేయనివ్వలేదు.

దూరంగా రైలు కూసింది.

చక్రవర్తి వడివడిగా పట్టాలవేపు నడిచాడు.

దూరంగా రైలు దూసుకుంటూ వస్తోంది.

చక్రవర్తి బ్రిడ్జిక్రింద నీడలోకి నడిచాడు ఎవరూ చూడరని. (చక్రవర్తి అమాయకుడు. చావదల్తే బ్రిడ్జిక్రింద నీడలోకే వెళ్ళక్కరలేదు. స్టేషన్లో అయినా చావొచ్చు. అంత రాత్రి అడ్డుపడటానికి ఎవరూ లేరక్కడ. వున్నా గమనించేస్థితిలో లేరు)

చక్రవర్తి నిశ్చింతగా కళ్ళుమూసుకొని పట్టాల మీద తల ఆనించి పడుకొన్నాడు. అతని కళ్ళలో ఎర్రటోపీ...జరీకండువా ... చౌకబారు నైలాన్ ఓణీలు...యివే మెదలుతున్నాయి.

ఒకటీ..రెండూ...నిమిషాలు గడిచాయి. పది వరకూ.

చక్రవర్తి ఆశ్చర్యంగా తలెత్తిచూశాడు. రైలు దూరంగా ఆగివుంది. పైన ఎర్రగా సిగ్నల్ వెలుగుతుంది. చక్రవర్తి పదినిమిషాలకు పైగా చూశాడు. ఇంకా పచ్చలైటు వెలగలేదు. రైలు కదలలేదు.

మృత్యువుగూడా చక్రవర్తిని తిరస్కరిస్తుంది. వున్నట్టుండి చక్రవర్తి ముసలి తలిదండ్రులు, పెళ్ళికానిచెల్లెలూ గుర్తుకొచ్చారు. మృత్యువు వద్దుపొమ్మని తరుముతుంటే బలవంతంగా దాన్ని కావలించుకోవటం యిష్టంలేక పోయిందతనికి.

లేచి మళ్ళీ రిక్షాదగ్గరకు నడవసాగాడు.

చక్రవర్తి బ్రతికిపోయాడు. కాని బి. ఏ. చచ్చిపోయింది. ఎప్పుడో చచ్చిపోయింది. చక్రవర్తి బి. ఏ. ఏనాడో చచ్చిపోయాడు. ఇప్పుడు బ్రతికున్నది "చక్రవర్తి బికారి" మాత్రమే.

★

# కళలలో జాతీయత

(21 వ పేజీ తరువాయి)

వరణం వుంటుంది. భిన్న స్వభావాలు, భిన్న ఆచారాలు గల ప్రజలు, తమ చరిత్ర, జీవిస్తున్న దేశం సామాజిక పరిస్థితులు రూపొందించిన మనుష్యులు మనకి కనిపిస్తారు.

## జాతీయ భావన

విశ్వాసం అన్నది ఏర్పడ్డాక, దానిని కదిలించడం చాల కష్టం. నాకో విశ్వాసం వుంది - ఒక కళాత్మకమైన రచనలో జాతీయ అంశం అనేది విలువలనూ, ప్రపంచ సంస్కృతియొక్క నైతిక ప్రాముఖ్యాన్ని ఆయా జాతీయ సంస్కృతికి చెందిన భావ చిత్రాలతో వ్యక్తీకరించడమే ననేది ఆ విశ్వాసం.

రాష్ట్రీయతత్వానికీ, దానికి సంబంధం లేదు. కళలతో జాతీయ భావాన్ని కాపాడడం చాల ముఖ్యమని నా భావం. జాతీయ లక్షణాలను చిత్రించడమే మన లక్ష్యమని కాదు నా వుద్దేశం.

మన జాతీయ సాహిత్యాలలోవున్న ముఖ్యమైన అంశం, విస్పష్టమైన సిద్ధాంత విషయిక, కళావిషయిక నియమాల యెడ వానికిగల దృక్పథం: కళాకారుడు ప్రజలలో ఒకడు కావాలి.

జాతి ఏదయినా సాహిత్యం కళలలో ఇదిముఖ్యం.

మన కాలపు సమస్యల గురించి గాఢంగా ఆలోచించి, లోతుగా పరిశీలించే కళాకారుడు తన రచనలలో యీ నియమాన్ని ప్రతిబింబించక మానడు. ఏమంటే అది మన సమాజంలో అస్థిమాంసాల్ని పట్టిపోయింది.